"ప్రియమైన......గారికి.

మీరు అహర్నిశలూ శ్రమపడి ఆఫీసరు పని సంపాదించినందుకు అభినందనాలు! కాని మీ స్వార్థంకోసం పడే పాకులాటలో వీసపాలు ఇతరులకోసం పడివుంటే మీ జీవితం యింకా ఆనందంగా వుండేదేమో! మీ ఫోర్జరీ ఉత్తరం వల్ల నాకు కనువిప్పు కలిగించినందులకు కృతజ్ఞతతో-

మీ అరుణ."

భూమి తిరుగుతున్నది! గిర్రున తిరుగుతున్నది! గంటకు వెయ్యిమైళ్ళ వేగంతో తిరుగుతున్నది!

# ప్రేమ పర్యవసానం

అంగర వెంకట కృష్ణారావు

'నిక్షేపంలాంటి కృష్ణవిగ్రహం విరిగి ముక్కలైపోయిందండీ.'

అతడు తల వంచుకుని చదువుకుంటున్నాడు.

'క్రిందపడి తుబ్బెగుబ్బెలైపోయిందండీ.'

అతడు తలైనా యెత్తడంలేదు. విగ్రహం ఆమె చేతిలోంచి జారిపోవడం, పెద్ద శబ్దంతో క్రింద ముక్కలవడం ప్రక్కనే జరుగుతూంటే అతనెలా వినకుండా వుండగలుగుతాడు! విన్నాడు- అంతే.

'చూడమంటే చూడరేం... నా చేతులు విరిగిపోనూ... చక్కని ముద్దొస్తూండేది విగ్రహం... ఐనా యీ గోడకి కొట్టిపెట్టండని బతిమాలితే విన్నారా మీరు!... మిమ్మల్నే... చూడరేం!' అంటూ అతని తల బలవంతంగా పైకెత్తింది.

'అల్లరిచెయ్యకు రాధా' అన్నాడు విశ్వనాథం ముక్తసరిగా.

'నా కృష్ణవిగ్రహం విరిగిపోయిందండీ' అంది యేడుపుగా, గునుపుగా, ముద్దుగా, నవ్వుతాలుగా.

'ఆ విరిగిపోయిన ముక్కలన్నీ యెత్తి అవతల పారేయ్- లేకుంటే కాళ్ళకి గుచ్చుకుంటాయి.'

'వెళ్ళండి- అలాంటి సలహాలు చెప్పక్కర్లేదు- నాకూ తెలుసు విరిగిన బొమ్మ పారేయాలని.'

అతడు మళ్లీ తలవంచుకుని చదువనారంభించాడు. మళ్లీ మొండిగా అతని తల యెత్తింది.

'మరొకటి కొనండీ...' అంది ఆ 'డీ'ని బాగా సాగదీస్తూ. ఆలోచన అన్యథా వున్నా చిరునవ్వు నవ్వక తప్పింది కాదు విశ్వనాథానికి.

'అది మట్టిబొమ్మ- అశాశ్వతమైనది. దాని మీద నీకంత మమకారం కూడదు. జీవితం అంతా యింతే- ఈ స్వల్పవిషయంలో అనంతమైన విశ్వరహస్యం సూక్ష్మరూపంలో గోచరిస్తూంది.'

అతడేదో వేదాంతం చెప్పుతూన్నంత సేపూ ఆమె ముఖంమీద అనేక రంగులూ, సీనులూ గబగబ మారిపోయేయి. విసుగుకుంటూ లేచి వెళ్ళిపోయింది. అతడు కొద్దిగా నవ్వుకొని తల వంచి తిరిగి చదువు ఆరంభించేడు.

రాధ కాపురానికి వచ్చి ఆరేళ్ళయింది. దంపతు లొకరినొకరు చాలా ప్రేమించుకుంటూరు. అతడిని విడిచి ఒక్క నిమిషం కూడా భరించలేదు రాధ. మానసికంగా, శారీరకంగా ఆమె యౌవనామృతం పొంగుతూన్న బంగారు కలశం. విశ్వనాథం కూడా మంచి రూపవంతుడే. కాని ఆసంగతి అతనికి తెలియదు. అతడెప్పుడూ స్వాప్నిక ప్రపంచవాసిలా గోచరిస్తాడు. ఈ దంపతుల తెన్నులో భూమ్యాకాశాంతరం వుంది.

ఆమె జీవితాన్ని ఒక అంటు మామిడిపండులా తినివెయ్యాలని చూస్తుంది- అతడు ఒక తప్పనిసరి సన్నివేశంలా గడుపుతాడు - ఆమె సినిమాకి వెడితే టిష్యూచీర కట్టుకోవాలి, బుట్టచేతుల బ్లౌజు తొడుక్కోవాలి, ముక్కు పుడక తీసి బేసరి పెట్టుకోవాలి. అతడు సాధారణంగా సినీమాలకి వెళ్ళడు. ఎప్పుడైనా రాధ బలవంతం మీద వెడితే ఆట మొదలెట్టింది లగాయితు చివరవరకూ హాయిగా నిద్రపోతాడు. అంచేత రసవంతమైన ఘట్టాలు చూడక ఆమె ఆనందం పంచుకోలేదు. ఆమె అందుకు ఎంతో బాధ పడుతుంది.

రాత్రి పదకొండు గంటలవేళ అత డీజీ చైరులో పడుకొని హృషీకేశంనించి వచ్చిన వేదాంత పత్రిక చదువుతూ తన్మయం అవుతూంటే-తెల్లటి దుప్పటీ పరిచిన శయ్యమీద కూచుని, తన తలలోని మల్లెపూల పరిమళాలు అల్లరి చేస్తూంటే పెళ్ళి ముందురోజులలో చదువుకున్న 'యామిహే కమిహ శరణం, పక్షిజన వచన కందితాహం' సన్నగా పాడుకుంటుంది.

అయితే విశ్వనాథానికి యీ ప్రపంచంలో పెద్దమనిషిలా జీవించడం తెలియకపోలేదు-అవసరాన్నిబట్టి అతడూ కేవలం లౌక్యంగా గడిపిన గడియలున్నాయి. రాధలో భక్తి లేకపోలేదు. ఆమె పూజ చేసుకుంటే గట్టుమీద మహాలక్ష్మి ప్రత్యక్షం కావాలి. కాని రంగు రంగుల ప్రపంచాన్ని చూడగానే ఆమెకళ్లు చెదిరిపోతాయి. ఆమె హృదయం పల్చని గాజుకన్న నాజూకైనది. అందుకే ఒకొక్కప్పుడు భర్త ప్రశాంతత చూసి పొంగిపోయేది, మరొకప్పుడతని డాంబిక రాహిత్యానికి విసుక్కునేది.

ఆరు సంవత్సరాలై కాపురం చేస్తూన్నా రాధకు పిల్లలు కలుగలేదు. పిల్లలకోసం ఆమె పరితపించి పోయేది.

ఓసారి వీధిలోకి అమ్మకవస్తే యేడాది పిల్లడంత గటపర్చా బొమ్మని పదిహేను రూపాయలిచ్చి కొంది. దానికి చొక్కా షరాయితో సహా అలంకారాలు చేసింది మరైదు రూపాయలు ఖర్చు చేసి. ఎత్తుకు ముద్దాడి, భర్త ఎంత మురిసిపోతాడో అనుకుంది. అంతదూరం నుంచే చూసి లోపలి మండువాలోకి వెళ్లి బొమ్మనెత్తుకుని నుంచుంది. అతడు చూసి చిన్న నవ్వు నవ్వి లోపలికి వెళ్లిపోయాడు. లోపలినించే 'రాధా యివాళ శాక పాకాలేమిటే?' అని ప్రశ్నించేడు మామూలుగా. ఆమెకు కోపం సిగ్గూ కలిగేయి. పైకి 'వంకాయ జీలకఱ్ఱ కారం' అంది కాని లోపల 'నా బొంద' అనుకుంది.

గదిలోకివెళ్లి రబ్బరు బొమ్మను బల్లమీద పెట్టి లేని సంతోషం తెచ్చుకొని 'బాగుందికదండీ' అంది. అతడు ఔనని తలవూపి, తరవాత ఆ బొమ్మలో ఎంత వేదాంతం యిమిడివుందో చెప్పేడు. ఈ లోకం అంతా బొమ్మలాట అనీ, యిది ప్రాణం లేనిపిల్లడనీ, అది ప్రాణం వున్న బొమ్మ అనీ యేవేవో చెపుతూంటే రాధ మూతిని ఏడెనిమిది వంకలకు పైగా తిప్పి వెళ్ళిపోయింది. చివరకి రాధ ప్రార్థన దేవుళ్ళంతా విన్నారు పుత్రకామేష్టి అక్కరలేకుండా ఆమె గర్భం ధరించింది. నెలలు యెదుగుతూన్నకొద్దీ ఆమెలో ఆనందం పొంగి పొర్లుతూంది. ఆమె కలలు కంటూంది రాబోయే రోజులను గురించి

ఓనాడు రాత్రి రాధ భర్తతో ప్రస్తావించింది:

'ఏమండీ- మన అబ్బాయికి యేం పేరు పెడదాం?'

'నా మెత్త ఊరికేపోవు- అబ్బాయో అమ్మాయో కలగన్నావా?'

'పోనిద్దురూ- మీరెప్పుడూ యింతే- నాకు తెలుసు అబ్బాయే- నావాడు వరహాల మూటలా వుంటాడు.'

'సరే నీమాటే కానీ. ఇప్పుడేం తొందర? మన ప్రజ్ఞ యింతవరకూ వచ్చింది కదా- ఒక స్వతంత్ర-ఆత్మకి జీవితకాలపు ఖైదు శిక్ష విధించేం యిద్దరం కలిసి. పుట్టనీ- ఆలోచిద్దాం'

'మిమ్మల్ని అడగడం నాదే పొరపాటు. నేను వాడికి 'ఆనందం' అని పేరు పెడతాను'

'నేను వాడికి 'ఒకటి' అని పేరు పెడతాను. ఏమంటే వాడు మన ఖైదీ నంబరు ఒకటి.'

ఆమెకు కోపంవచ్చి ప్రసంగం మార్చింది.

రాధే గెలిచింది. టెలిగ్రాం వేసి [illegible] తండ్రిని అడిగింది. విజయవంతంగా చిరునవ్వు నవ్వుకుంది. 'ఏమువూ, నవ్వూ-యిదే లోకం పోకడ-ఇప్పుడెందుకు అన్ని కేకలేశావు పిల్లా?' అంది మంత్రసాని దమాషా కోపంతో. వెఱ్ఱి మనిషి దీనికేం తెలుసు అనుకుంది రాధ. అక్కడ కూడా వేదాంతం వచ్చినందుకు మండిపడింది. చూపు పిల్లవాడివేపు. తలపు విశ్వనాథంవేపు మరల్చి 'ఆనందం' అనుకుంది.

సగర్వంగా 'ఆనందా'న్ని భర్త చేతిలో పెట్టింది రాధ. విశ్వనాథానికి యెత్తుకోవడం చాతకాక పరుపుమీద పడుకోపెట్టేడు. పనస పండులాంటి పిల్లాడిని చూస్తే అతడికి ముచ్చట వేసింది. చేతికి బంగారు పత్తులు, కాళ్లకి గజ్జెలు, మెడలో పచ్చటి ఒంటిపేట గొలుసు చేయించి పెట్టేరు తల్లివంక వారు. పులిగోరు, చిరుగంట

తగ్గిరాలు వేసిన మొలతాడు చేయించమంది భర్తని రాధ. సహజ సౌందర్యం గలవాడికి అలంకరణాలు అక్కర్లేదన్నాడు విశ్వనాథం. కాని ఆ మాటలు ఆమెకు రుచిగా లేవు. ఆమె 'పట్టు పట్టరాదు, పట్టిన విడరాదు' లాంటి వేమన వంటిది. మూడు రోజులు పోయాక మొలతాడు తొడిగి తీరింది.

రాధ కొడుకును హృదయ పర్యంతం దిగనిచ్చేది కాదు. పనులు చేస్తూ యెత్తుకు తిరిగేది. ఏదో మిష పెట్టి నలుగురు అమ్మలక్కలనీ పోగు చేసి వాడికి ఉత్సవాలు చేసేది.

విశ్వనాథానికి కొడుకును ప్రేమించడం తెలీదనుకునేది. పిల్లడి నెప్పుడూ ముద్దులు పెట్టుకోడనీ, సాయంత్రం సముద్రపు టొడ్డుకు షికారు తీసుకెళ్లడని, ఫొటో తీయించడని మారాం చేసేది. ఒకనాడు పట్టు పట్టింది ఫొటో తీయిస్తారా తీయించరా అని.

'రాధా! నాకు పిల్లడిమీద అభిమానం లేదనుకోకు. నీకంటె యెక్కువుంది. కాని నేనిమీదా యెక్కువ మమకారం కూడదు. జీవితమే వొక గొప్ప మోహం. ఇది నాది, ఇది లేకపోతే నే నుండలేను అని ఎప్పుడైతే అనుకుంటామో అప్పుడే అన్ని విపత్తులకూ అంకురార్పణ మౌతుంది.'

ఆమె మనస్సు గాయపడింది. 'ముచ్చటపడి నేనేదో అంటే మీరింత ఉపన్యాసం చదివేరు. మగవారంతా యింతే. మీ డబ్బు ఖర్చు చెయ్యక్కర్లేదు లెండి. నా కానుకల పేరులో ఒకటి తీసి బాబుకు ఫోటోలు తీయిస్తాను, యింకా యింకా శృంగారిస్తాను, నా బతుకంతా వాడికోసమే' అంది.

'నేను వుపన్యసించలేదు రాధా - నిజం చెప్పేను. మనస్సు అన్యాయత్తం చెయ్యడమే దాస్యం-కట్టుదిట్టం చేసుకోవడమే స్వేచ్ఛ, మొదటిదానంత నరకం లేదు - రెండోదానంత స్వర్గం లేదు.'

ఆమెకది నచ్చలేదు.

ఆనందాన్ని వడిలో పెట్టుకుని రెండు సంవత్సరాలు రెండు నిమిషాల్లా గడిపింది.

ఆనందానికి జబ్బు చేసింది. రాధ గుండెలలో పెద్ద కొండ పడింది. డాక్టరు వచ్చేలోపున అరసవిల్లి సూర్యనారాయణకి, అన్నవరం సత్యనారాయణకీ, ఇంకా యే యే దేవుళ్ళకో మొక్కుకుంది. కంట తడిపెట్టి భర్తతో అవన్నీ చెప్పింది. ఆపద మొక్కులు హృదయారాటాన్ని తెలియచేస్తాయి కాని, భగవంతుడిని 'లంచగొండి' అని రుజువు చెయ్యవు అని అతడంటే 'మీలో యింత కసాయితనంగలదని నేను కలలోకూడా భావించలేదు' అంది.

డాక్టరు వచ్చి పరీక్ష చేసి పరవాలేదని ఆమెతో చెప్పి భర్తతో చాటుగా యేదో చెప్పేడు. అందుకు ఆమెలో ఎంతో గాభరా బయలుదేరింది. భర్తముఖంలో విచారచిహ్నాలు ఆమెని మరింత భయపెట్టేయి. సాయంత్రం జాగ్రత్తగా వుండమన్నారు డాక్టరుగారు అంటే ఆమె గడగడ వణికిపోయింది. బావురుమని యేడవ నారంభించింది. విశ్వనాథం డాక్టరు

ఈ క్రింది ఊళ్లలో ఇంగ్లీషు, తెలుగు 'స్వతంత్ర' పత్రికలు అమ్ముటకు,
ఏజెంట్లు కావలెను:

బళ్లారి, చోడవరం, చల్లపల్లి, ముద్దనూరు, నాగపూరు, నరసీపట్నం,
పొన్నపల్లి అగ్రహారం, శృంగవరపుకోట, వెల్లూరు, ఎలమంచిలి, కైకలూరు.

వివరములకు:—

మేనేజరు, 'స్వతంత్ర'

160 లాయిడ్స్ రోడ్, రాయపేట, మదరాసు-14.

గారితో వెళ్లేడు మందులకని. ఇరుగుపొరుగు పెద్ద లిద్దరున్నారు పిల్లవాడి దగ్గర.

రాధ యేడుస్తూ గబగబ వంటింట్లోకి వెళ్లి కట్టుకాసులపేరు తీసి వెంకటరమణమూర్తి పేర మీదు కట్టి పసుపుగుడ్డ చుట్టి దేవుడిపెట్టెలో పెట్టి రెండుచేతులూ జోడించి గద్గదికతో 'తండ్రీ! నా కడుపులో అగ్ని పడనీకు. నావంటి తల్లుల కడుపుచిచ్చు నీకు తెలుసు. లేకలేక కలిగిన నా ఆనందంవల్ల అవి త్రెంపివేయకు.' అని ప్రార్థించింది. మందులు పట్టుకొని విశ్వనాథం రాగానే తన మొక్కు సంగతి చెప్పింది. పైగా కొడుకు ఆరోగ్యం విషయంలో అతడు చాలా అశ్రద్ధగా వున్నాడని కఠినంగా అంది.

దేవుళ్లు మరొకసారి రాధ ప్రార్థనలు విన్నారు. ఆనందానికి నిమ్మళించి, క్రమేపీ బలం చేకూరుతూంది.

రాధ భర్తమీద ఒకవిధమైన యెగతాళియుద్ధం ప్రారంభించింది. ఏదో సందర్భం కలిపించుకుని అతడిని దెప్పుతుంది. ఆనందం కేవలం తన ప్రయత్నంవల్లే పునర్జన్మ పొందేడనేది. కాని అతడు కొండవలె చలించకుండా ఆమె అజ్ఞానానికి లోలోపల చింతించేవాడు. అతడి మౌనాన్ని ఆమె అపార్థం చేసుకుని 'తల్చుకుంటే మనం చెయ్యలేని దేముంది—— వాడు నా రక్తంలో రక్తం, కండలో కండ. వాడినీ నన్నూ యే గోచరాగోచర శక్తులూ విడదియ్యలేవు.' అంది.

'రాధా మమకారం అలా అనిపిస్తుంది. ఈ మమకారమే చక్రవర్తి మొదలు చమారివాడి వరకూ అందర్నీ ఆవేశించి త్రైతక్కలాడిస్తూంది. ఆగ్రాలో తాజ్ మహల్ పెద్దరూపు దాల్చిన మమకారం. ఈ 'నేను' అర్జునుడి నొకసారి శివమెత్తిస్తే, కృష్ణుడు అతనికి సత్యం విడమర్చి చెప్పి అతని నిమిత్తమాత్రతని బోధపరిచేడు'.

ఆ జవాబు ఆమెకు క్వినైనులా వుంది.

ఆరు నెలలు తిరగలేదు, రాధకు జబ్బు చేసింది. జబ్బుకంటె ఆమెని బెంగ యెక్కువగా బాధపెట్టసాగింది. డాక్టరువచ్చి జాగ్రత్తగాచూసి వైద్యం చేస్తున్నాడు. నానాటికీ ఆమె జబ్బు, దానికంటె బెంగ, ఎక్కువై పోవసాగేయి.

మంచంమీంచి లేచి తిరిగే పరిస్థితి తప్పిపోయిన దగ్గరనుంచీ ఆనందాన్ని ఎత్తుకుని యెవరో ఒకరు ఆమె యెదురుగా కూచోవలసి వచ్చింది. డాక్టరును రోజూ తను చచ్చిపోను కద అని అడుగుతూండేది. ఆశ్చర్య పడవద్దని చెప్పేవాడు, కాని అది టైఫాయిడు జ్వరం అని చెప్పలేదు ఆమెతో. ఆమెకు వుష్ణతీవ్రతవల్ల తెలివితప్పి పోతూండేది తరుచు. నుదుటపై మంచులో తడపిన పట్టీలు, ఉడికొలోను పట్టీలు వేసి విశ్వనాథం వుపచారాలు చేస్తూండేవాడు-ఆమె కంటికీ మంటికీ యేకధారగా యేడుస్తూండేది. ఒకనాడు మంచి జ్వర తీవ్రతలో భర్తవేపు బెంగగా చూసి కన్నీరు కారుస్తూ 'ఏమండీ. నేను చచ్చిపోతానా! ఆనందం! నేను వాడిని విడిచి వెళ్ళలేను' అని వెక్కుతూ మరిమాట్లాడ లేకపోయింది నీరసంచేత. అతడు చాలా ధైర్యం చెప్పేడు. ఆ మరునాడు ఆమెకు జబ్బు చేసి యిరవై ఒకటో రోజు. విశ్వనాథం పిల్లాణ్ణి ఎత్తుకొని మంచం దగ్గరగా పచారుచేస్తూంటే ఆశగా రెండు కళ్లూ వప్పజెప్పింది ఆనందానికి ఆమె.

మధ్యాహ్నం పన్నెండు గంటలకు డాక్టరు వచ్చి పరీక్ష చేసేడు. ఆమెకు మందు యివ్వడం లేదు. ఏ రంగు మందు యిస్తే ఆ రంగు చెమట వచ్చి దుప్పటి తడిసిపోతోంది. ఆమెకు స్పృహ తప్పి పోయినట్టయింది. తెలివి లేదనుకొని డాక్టరు, సాయంత్రం ఆరు గంటలకు, అని చెప్పేడు. ఆమాట ఆమె చెవిన పడిన వెంటనే ఒకభయోత్పాతంకలిగి, నిరాశ కళ్లమీద ఒక పొరకప్పింది. దూరంగావుంటే ఆమెకు ఆనంద కనుపించక దగ్గరగా ఎత్తుకు కూచున్నాడు విశ్వనాథం.

సాయంత్రం ఐదు గంటలకు ఆమె కళ్లంట వచ్చిన నీళ్లలో, అవ్యక్తంగా కదిలిన పెదవులపై ఆమె అతని క్షమకోరుతూన్నట్టు అతడూహించ గలిగేడు. ఆమె దృష్టి యెంతమందగిస్తే అంత కళ్లు విప్పార జేసి ఆనందాన్ని చూడడానికి ప్రయత్నించింది. చివరకి ఆమె జ్యోతి ఆరిపోయినా ఆ కళ్లు ఆనందం కోసం తెరుచుకునే వుండిపోయేయి.